# ట్రైనెట్ న్యూస్

https://trinetnews.com/

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 PM TO 10 PM

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 / సంచిక:25 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 10,2026


# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



- కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ
- అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య
- ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు.

02

## తెలంగాణలో ప్రభుత్వమే గుండాగిరీకి పాల్పడుతోంది..

కేసీఆర్ ఇంటి మీద దాడికి వేలాదిమందిని రేవంత్ పంపాడు..!



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10


తెలంగాణలో ప్రభుత్వమే గుండాగిరీకి పాల్పడుతోందని, కేసీఆర్ ఇంటి మీద దాడికి వేలాదిమందిని రేవంత్ రెడ్డి పంపాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీ వద్ద పోలీసులు చేసిన దాడిపై మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ దగ్గర ఫిర్యాదు చేసేందుకు మహిళా ఎమ్మెల్యేలతో కలిసి ఆయన గురువారం ఢిల్లీకి వెళ్లారు.

## నీళ్లు ఉండి మోటార్లు నడపడం చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా హరీశ్ రావు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.రాజకీయ వార్తలు చదవండికరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు.బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన కృష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలోనేనన్నారు.



## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

### మరమ్మతుల కోసం ఆగిన కార్గో నౌక

### 20 మంది మృతి, ఐదుగురు గల్లంతు

న్యూఢిల్లీ,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10:

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## రష్యా నుంచి 105 విమానాలు కొనుగోలు చేయనున్న ఇండియా..

### బ్రిక్స్ సదస్సులో ఒప్పందం కుదిరేనా

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

రష్యా-ఇండియా మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు ఎప్పటినుంచో బలంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి ఇండియా విమానాలు కొంటూ వస్తోంది. తాజాగా మరిన్ని విమానాల్ని రష్యా నుంచి కొనేందుకు ఇండియా సిద్ధమైంది. 105 వరకు ప్రాంతీయ, పౌర రవాణా విమానాల్ని రష్యా నుంచి ఇండియా కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయి.శనివారం నుంచి ప్రారంభ కానున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఇండియా-రష్యా మధ్య ఈ అంశంపై ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్-114-300 సంస్థకు చెందిన ప్రాంతీయ, ప్యాసింజర్ విమానాల్నిఇండియాలోని వివిధ సంస్థలు కొనుగోలు చేయనున్నాయి. ఈ అంశంపై సంస్థ సీఈవో వాదిమ్ బదేకా మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఇండియన్ కంపెనీలతో చర్చలు జరిగాయని, అనేక ఒప్పందాలు జరిగాయని వెల్లడించారు. ఇండియన్ కంపెనీలైన పినాకిల్ ఎయిర్ సంస్థ 50 విమానాల్ని, ఎయిర్ కేరళ సంస్థ 20 విమానాల్ని కొనుగోలు చేయనుండగా.. మరో సంస్థ మిగతా 35 విమానాల్ని కొనుగోలు చేయనుంది. మేరకు సంస్థల మధ్య ఎంవోయూ కుదుర్చుకోనున్నాయి. అలాగే, ఆరు విమానాలకు సంబంధించి ఫ్లెమింగో ఏరోస్పేస్ సంస్థ జనవరిలో ఒప్పందం కుదుర్చుకుంది. మరోవైపు.. ఇండియాలో విమానాల తయారీ అంశాన్ని కూడా రష్యా పరిశీలిస్తున్నట్లు సమాచారం. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థతో యూఏసీ ఈ అంశంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది అమలైతే.. రెండు సంస్థలు కలిసి ఇండియాలోనే సంయుక్తంగా విమానాల్ని తయారు చేస్తాయి.





## ఎల్ నినోపై చంద్రబాబు సమగ్ర వ్యూహం

### : కలెక్టర్లకు కీలక ఆదేశాలు

- అమరావతిలో 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు
- ఎల్ నినో ప్రభావంపై సమీక్ష
- 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- తాగునీరు, పశుగ్రాసానికి కొరత రాకుండా చూడాలని సూచన
- రైతులు, వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం
- ఎల్ నినోపై ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తానన్న ముఖ్యమంత్రి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

రాష్ట్రంపై 'సూపర్ ఎల్ నినో' ప్రభావం పొంచి ఉన్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసింది. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశంపై లోతుగా చర్చించి, అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో విపత్తును ఒక సవాల్‌గా స్వీకరించి, రైతులు, వినియోగదారులపై దాని ప్రభావం పడకుండా చూడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, మంత్రులు, అధికారులు, కలెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా నీటిపారుదల ప్రాజెక్టుల ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కి చెప్పారు. "ఈ సీజన్‌లో తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల్లోనూ పట్టిసీమ ద్వారా 39.5 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి లక్షల ఎకరాల పంటను కాపాడగలిగాం. ప్రస్తుతం పట్టిసీమ నుంచి 8,100 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ప్రకాశం బ్యారేజీకి 6,700 క్యూసెక్కులు చేరుతోంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని కరవు నుంచి శాశ్వతంగా గట్టెక్కించే 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రాబోయే మూడేళ్లలో పూర్తి చేయాలి" అని లక్ష్యం నిర్దేశించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ, హంద్రీనీవా పనులను వేగవంతం చేసిన జలవనరుల శాఖ మంత్రిని, అధికారులను అభినందించారు. నిర్దేశిత గడువు కంటే ముందే పనులు పూర్తి చేసే కాంట్రాక్టర్లకు, అధికారులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు.ప్రజలపైనా ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

02

మొదటిపేజీ తరువాయి

# దిశానిర్దేశం

అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు.ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణలో ప్రభుత్వమే గుండాగిరీకి పాల్పడుతోంది..

మహిళా ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్లిన జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీకి వెళ్తున్న తమను రాష్ట్ర పోలీసులే అడ్డగించి దాడి చేశారని, తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని తెలిపారు. కేసీఆర్ ఇంటి మీదకు దాడి చేయడానికి రేవంత్ రెడ్డే పోలీస్ ఎస్కార్ట్‌ను ఇచ్చి వేలాది మంది గూండాలను పంపించాడని ఆయన ధ్వజమెత్తారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌జనరేటెడ్ ఫోటోలను చేసి తమ నాయకుల మీద 4 కేసులు పెట్టారని తెలిపిన జగదీశ్ రెడ్డి.. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసి తిరిగి వారి మీదనే కేసులు పెట్టారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి అరాచకాలకు సంబంధించి మానవ హక్కుల కమిషన్ దగ్గర, మహిళా కమిషన్ దగ్గర ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి వచ్చామని మాజీ మంత్రి పేర్కొన్నారు.అసెంబ్లీ వద్ద పోలీసులు చేసిన దాడిపై ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్ దగ్గర, మహిళా కమిషన్ దగ్గర ఫిర్యాదు చేసేందుకు మహిళా ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లిన జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

మొదటిపేజీ తరువాయి

# ఎల్ నినోపై చంద్రబాబు సమగ్ర వ్యూహం

"పంటలు సరిగా పండకపోతే నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. దీనిని అరికట్టేందుకు మంత్రుల కమిటీ నిరంతరం పనిచేయాలి. రైతు బజార్లను చైతన్యవంతం చేయాలి. భవిష్యత్తులో డిమాండ్ ఉండే ఉల్లి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటి పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలి. అవసరమైతే రాయితీలపై విత్తనాలు అందించి, కనీస మద్దతు ధర ప్రకటించే అంశాన్ని కూడా పరిశీలించాలి" అని సూచించారు.రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏయే పంటలకు బీమా ఉందో గుర్తించి, ఆ పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, పంట నష్టపోతే బీమా డబ్బులు అందేలా చూడాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను నింపాలని, వచ్చే వేసవి వరకు నీటి సరఫరాకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గతంలో తిరుమలకు నీటి ఎద్దడి వచ్చినప్పుడు 100 రోజుల్లో పైపులైన్ వేసి సంక్షోభాన్ని నివారించిన విషయాన్ని గుర్తుచేశారు.పశువుల దాణాకు కొరత రాకుండా, పచ్చదనం తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాధార పంటలను ప్రోత్సహించడం, పశుగ్రాసం పండించడం, మల్చింగ్ కోసం విత్తనాలు వేయడం వంటి పనులు చేపట్టాలన్నారు. విత్తనాలను డ్రోన్ల ద్వారా చల్లే విధానాన్ని ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. "విపత్తులను మనం ఆపలేం. కానీ, ప్రజలపై వాటి ప్రభావం పడకుండా చూడటమే ప్రభుత్వాల బాధ్యత. 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చాలా ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆగిపోయాయి. అవి పూర్తయి ఉంటే ఇప్పుడు ఇంత ఇబ్బంది ఉండేది కాదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎల్ నినో పరిస్థితులపై ఇకపై ప్రతి వారం సమీక్ష జరుపుతానని, తాను కూడా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

# రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ ఆత్మహత్య

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు. రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆర్టీసీ బస్సు బీభత్సం.. పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు

## ఘటనలో రెండు కార్లు, ఆటో ధ్వంసం

హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు నియంత్రణ కోల్పోయినట్లు సమాచారం. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు అక్కడ నిలిపి ఉన్న వాహనాలను ఢీకొట్టింది.బస్సు బంకులోకి వెళ్లే క్రమంలో రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టింది. అంతేకాకుండా డీజిల్ పంపునకు కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది.బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన మొత్తం ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డైంది. ప్రస్తుతం ఈ దృశ్యాలు బయటకు రావడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

## తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు

2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్

వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు

లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం

ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఈ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డీ డిజిటల్ హ్యూమన్ హెల్త్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రితేష్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగం పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా నూతన శకంలోకి అడుగుపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 2,000కు పైగా కంపెనీలతో సంపూర్ణమైన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ఉందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని తెలిపారు. అంతేకాకుండా అమెరికా వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్‌జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది. జీనోమ్ వ్యాలీతో పాటు ఐఐసీటీ, సీసీఎంబీ, నైపర్ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉండటం హైదరాబాద్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోందని నేతలు వివరించారు.

# డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది ఐదు గ్యారెంటీలను సవ్యంగా అమలు చేస్తున్నాము

## మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు.

# రాజకీయ నాయకుల వేధింపులు తాళలేక ప్రముఖ రియల్టర్ ఆత్మహత్య..!



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

రాజకీయ నాయకుల వేధింపులు తాళలేక హోమ్ ల్యాండ్ అధినేత, ప్రముఖ రియల్టర్ రాంరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. స్వగ్రామం నేదునూరులోని ఫామ్ హౌస్‌లో గురువారం ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. పఠాన్ చెరులో 250 ఎకరాల్లో నూతన వెంచర్ చేస్తున్న రాంరెడ్డి ఆత్మహత్యకు రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది.హోమ్ ల్యాండ్ అధినేత బనలా రాంరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని స్వగ్రామం నేదునూరులోని ఫామ్ హౌస్‌లో ఊరి వేసుకొని ఆయన మరణించారు. సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న కందుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు.రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన రాం రెడ్డి హైదరాబాద్ మణికొండలో నివసించేవారు. పఠాన్ చెరులో 250 ఎకరాల్లో వెంచ్ భూమి వివాదం, అప్పులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా తీవ్ర ఒత్తిడికి లోనైన ఆయన సూసైడ్ చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు.. సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేశారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136